క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు తమ సమస్యలను మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఫోన్ ద్వారా డిపో మేనేజరు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. 9959225673 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌పై అవగాహన


పిల్లలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: పోలీస్ స్టేషన్ వ్యవస్థ పనిచేసే విధానంపై పాఠశాల పిల్లలకు సోమవారం అవగాహన కల్పించారు. నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరిశీలించారు. పిల్లలకు ఎఫ్ఐఆర్‌ల నమోదు అరెస్టు రిమాండు రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలపై పలు చార్జీల పేరుతో భారం వేయడం సరికాదని సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక గాంధీవిగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ, సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు ప్రైవేటు పరం చేసిందని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటు పేరుతో వేలకోట్లు దోచుకోవాలని యత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజన్, గంగరాజు, జనార్దన్, గోపినాథ్, చైతన్య, విజయగౌరి, రమాదేవి, జమీలాభి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఇదే!


పాత కలెక్టరేట్‌లోని మైనింగ్ శాఖ భవనం

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్ కార్యకలపాలకు తాత్కాలికంగా అధికారులు ఓ ప్రభుత్వ భవనాన్ని గుర్తించారు. చిత్తూరు నగరం పాత కలెక్టరేట్‌లోని మైనింగ్ శాఖ భవవాన్ని రూరల్ తహసీల్దార్‌లో కార్యాలయంగా వినియోగించనున్నారు. అన్ని రకాలుగా ఈ భవనం అనుకూలంగా ఉందని అధికారులకు నివేదికలు పంపారు. దీంతో ఆ భవనం కేటాయింపు పూర్తయింది. త్వరలో ఇక్కడ కార్యాలయం ప్రారంభం కానుంది.

రేపు ముక్కంటి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

మయూర వాహనంపై విహారం


మయూరంపై విహరిస్తున్న సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం సోమవారోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి, పద్మావతి, శనీశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవల్లీదేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలలో బారులు తీరారు. స్వామివారికి ప్రాకారోత్సవాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. కావడులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామకుప్పం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వేరుశనగ చెట్ల నుంచి కాయలు వేరుచేస్తున్న రైతులు


వేరుశనగ ఒబ్బిడి ప్రారంభం

ఈ సారీ అదునులో కాకపోయినా, అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు వేరుశనగ పంట చేతి కొచ్చేసింది. పంట ఎండుముఖం పట్టిందని ఆందోళన చెందుతున్న తరుణంలో భారీ వర్షం కురవడంతో వాడిన చెట్లన్నీ మళ్లీ కళకళలాడాయి. ఫలితంగా మండలంలో పంట కోతకొచ్చింది. ఒబ్బిడి పనుల్లో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు. శరవేగంగా ఒబ్బిడిని పూర్తి చేసుకుంటున్నారు. 80 శాతం పంట దిగుబడి చేతికొచ్చిందని సంతోషంగా ఉన్నారు.

- అప్పుడప్పుడూ కురిసిన వర్షాలకే 80శాతం చేతికొచ్చిన పంట
- మిగిలిన పంటపై పందులు, వరుణుడి ప్రభావం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో ఖరీఫ్ అంటే గుర్తుచ్చే పంట వేరుశనగ. వర్షాధార పంటగా వేరుశనగను అధిక విస్తీర్ణంలో పండిస్తారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈ సారి వేరుశనగ సాధారణ విస్తీర్ణం 1960 ఎకరాలుగా ఉంటే, 1,777 ఎకరాల్లో పంట సాగు చేశారు. దీంతోపాటు కందులు 74 ఎకరాలు, మినుములు 49.86 ఎకరాలు, ఉలవలు 790 ఎకరాలు, అలసందలు 66 ఎకరాలు, అనుములు 20 ఎకరాలు, పచ్చరొట్టిలు 202 ఎకరాల విస్తీర్ణంలో సాగులోకి తెచ్చారు. ప్రస్తుతం మండలంలో వేరుశనగ పంట కోత మొదలైంది. 50 శాతం మంది రైతులు నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. కూలీలకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి. ఇక దీపావళి పండగకు ముందు వేరుశనగ ఒబ్బిడిని పూర్తి చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా 80 శాతం వరకు పంట దిగుబడి ఈసారి పర్వాలేదనిపించుకుంది. చెట్టుకు 40 నుంచి 45 గట్టి కాయలు తేలుతున్నాయి. మిట్ట ప్రాంతాల్లో మాత్రం కాయలు 30 నుంచి 40 వరకు ఉన్నాయి. ఈ క్రమంలో ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు వచ్చే అవకాశాలున్నాయని రైతులు అంటున్నారు. 20 శాతం మాత్రం పంట అదును తప్పడం, పందుల బెడద, కలుపు నివారణ చర్యలు చేపట్టకపోవడం వల్ల పంట దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు.

పంట తగ్గుముఖానికి కారణాలు

గత కొన్ని రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు ఈ క్రాప్ బుకింగ్ చేపడుతున్నారు. ఏయే రకాల పంటలు పండిస్తున్నారు? అవి ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి? ఎంత మంది సాగు చేస్తున్నారనే అంశాలపై వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో జల్లెడ పడుతున్నారు. ఈ నమోదులో వేరుశనగ సాగు కాస్త తగ్గుముఖం పట్టడానికి కారణాలను గుర్తించారు. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో చినుకు నేల రాలేదని గుర్తించారు. ఆ తర్వాత కురిసిన వర్షాలు అదునుకు ఉపయోగపడినా, ముందస్తు వర్షాలు రైతులను ఊరించలేకపోయినట్లు గ్రహించారు. దీంతో పాటు వివిధ రకాల పండ్ల తోట పెంపకంపై దృష్టి పెట్టడం, బోరుబావుల్లో నీళ్ల పుష్కలంగా ఉండడంతో కూరగాయలు, పూలసాగు, కొబ్బరి తోటలు, అరటి వంటి పంటలు పండించి అధిక ఆదాయం కోసం ముందుకెళుతున్నట్లు గుర్తించారు. మరి కొంత మంది అదును తప్పి పంట వేశారు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు చెట్టు ఏపుగా పెరిగినా, దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. పందుల బెడద అధికమై మిట్ట ప్రాంతాల్లో సాగైన పంటలను పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో పంటలు అక్కడక్కడ దెబ్బతిన్నాయి.


చిత్తూరు మండలం తుమ్మిందలో వేరుశనగ పంట ఒబ్బిడి చేస్తున్న రైతులు

పంటకోత ప్రయోగం



చిత్తూరు మండలం తుమ్మింద గ్రామానికి చెందిన దశరథన్ 1.3 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. ప్రస్తుతం ఆ పంట కోతకొచ్చింది. వ్యవసాయశాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ మోహన్ క్షేత్రస్థాయికి వెళ్లి పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. 5 మీటర్ల పొడవు, వెడల్పులో పంటను ఒబ్బిడి చేశారు. ఈ దిగుబడిని తూకం వేయగా 7 కిలోలు వచ్చాయి. ఈ లెక్కన రైతుకు 8 నుంచి 9 బస్తాల దిగుబడి రావచ్చని వ్యవసాయశాఖ అధికారుల అంచనా వేశారు.

చెట్టుకు 40 కాయలు



చిత్తూరు నగర పరిధిలోని ఎల్‌బీ పురానికి చెందిన వరదరాజుల నాయుడు 70 సెంట్లల్లో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేశారు. రెండు రోజుల నుంచి ఒబ్బిడి ప్రారంభించారు. ఒక చెట్టుకు 40 నుంచి 45 కాయలున్నాయి. ఈ లెక్కన అతనికి 7 బస్తాల దిగుబడి రావచ్చని రైతు చెబుతున్నాడు. ఈ మాత్రం దిగుబడి పర్వాలేదని ఆనందం వ్యక్తం చేశాడు.

కాయలొచ్చాయి.. పందులు పడ్డాయి



ఏడు గుంటల్లో వేరుశనగ వేశా. పంట పర్వాలేదు. కాయలు వచ్చిన కాడికి గట్టిగానే ఉన్నాయి. ఈ వానలు తొలుత భయపెట్టాయి. తర్వాత అదునులోనే వరుణుడు పంటను కాపాడాడు. దిగుబడి బాగానే వచ్చింది. కానీ పందులు వదల్లేదు. చాలా బొట్ల తోడేశాయి. చెట్లల్లో కాయలు లేకుండా చేశాయి. దీంతో కోత కొచ్చిన పంట కాస్త చేతికి రాకుండా పోయింది.

–జయమ్మ, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

దిగుబడి పర్వాలేదు



తొలకరి వర్షాలు, రైతులకు సాగుపై ఆసక్తి తగ్గడం, కొత్త రకం పంటల వైపు మొగ్గు చూపడంతో వేరుశనగ సాగు తగ్గుముఖం పట్టింది. అయితే పంట వేసిన రైతులకు మాత్రం దిగుబడి మాత్రం బాగానే ఉంది. కోత మొదలు పెట్టిన ప్రతి ప్రాంతంలోను పంట కోత ప్రయోగం ప్రారంభించాం. కాయలు బాగానే ఉన్నాయి. అదును తప్పిన రైతులు మాత్రం కొంత నిరాశతో ఉన్నారు.

–మధుసూదన్‌రెడ్డి, ఏడీ, వ్యవసాయశాఖ

సెలవుల్లో శిక్షణ వాయిదా వేయాలి

చిత్తూరు కలెక్టరేట్: దసరా సెలవుల్లో టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు వాయిదా వేయాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాల్ట్ కార్యక్రమంలో టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. మొదటి విడతగా 9 నుంచి 14 వరకు, రెండవ విడతగా 16 నుంచి 21 వరకు, మూడవ విడతగా 26 నుంచి 31 వరకు శిక్షణ ఇవ్వాలని షెడ్యూల్ విడుదల చేశారని చెప్పారు. రెండవ విడత శిక్షణ దసరా సెలవుల్లో నిర్వహించాల్సి వస్తుందన్నారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని రెండవ విడత శిక్షణను వాయిదా వేసి సెలవుల అనంతరం నిర్వహించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు.

ఏఆర్ఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఏఆర్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ఎస్ఐ కమలనాథరెడ్డి కుటుంబానికి పోలీసుశాఖ సోమవారం ఆర్థికసాయం అందించింది. ఎస్పీ రిషాంత్‌రెడ్డి తన కార్యాలయంలో ఐడీఆర్ఎఫ్ నుంచి రూ.లక్ష చెక్కును మృతుడి భార్య విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ కుమార్ ఉన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపిక


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 25 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 65 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సాంస్కృతిక కళా ఉత్సవం




కాణిపాకం వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల్లో కళాకారుల ప్రదర్శనలు మరో ఉత్సవాన్ని తలపించాయి. వీక్షించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ఈ కళా ప్రదర్శనలు ఉత్సవాలతోపాటే సోమవారం పరిపూర్ణమయ్యాయి.

–కాణిపాకం(యాదమరి)


కాణిపాకంలో సాంస్కృతిక కళావేదికపై నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

స్పందన వినతులకు సత్వర పరిష్కారం


కమిషనర్ అరుణను సత్కరిస్తున్న బోర్ ఆపరేటర్లు

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సత్వరం పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఏస్థాయిలో ఉన్నయో తెలుసుకున్నారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగానికి-8, మెప్మా -2, ప్రజారోగ్య విభాగం -2, రెవెన్యూ-1, టౌన్ ప్లానింగ్-1 చొప్పున మొత్తం 14 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్దన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌ఓ డా.లోకేష్, మేనేజర్ తనూజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బోర్ ఆపరేటర్లకు వేతనాల చెల్లింపు

ఆప్కాస్ నుంచి బోర్ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం వారు నగర కమిషనర్, సహాయ కమిషనర్ గోవర్దన్‌ను కలిసి శాలువతో సత్కరించారు. నగరపాలక సంస్థ విలీన పంచాయతీల్లో బోర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారిని ఇటీవల ఆప్కాస్ పరిధిలోకి చేర్చారు. వీరంతా కొన్ని నెలలుగా వేతనాలందక ఇబ్బందులు పడుతుంటే, కమిషనర్ చొరవ తీసుకుని వేతనాలు అందించే ఏర్పాట్లు చేశారు. దీంతో వారు ఇటీవల ఆప్కాస్ పరిధిలో తొలిసారిగా వేతనాలను పొందారు. దీంతో వారు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సామాన్యుడికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం


పూతలపట్టు: మహిళకు ఆయుష్మాన్ కార్డును అందిస్తున్న ఎంపీడీఓ గౌరి

ఐరాల: సామాన్యుడికి సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని స్థానిక సర్పంచ్ మనోరంజని అన్నారు. మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని చినకాంపల్లె సచివాలయ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు 453 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, డాక్టర్ చందన, కొత్తపల్లె సర్పంచ్ బాలాజీ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం

యాదమరి: జగనన్న సురక్ష పథకంలో అందరికీ ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. జగనన్న సురక్ష పథకంలో సోమవారం మోర్ధానపల్లె పంచాయతీలోని సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు చేసి మందులు అందిస్తున్నారన్నారు. అనంతరం రోగులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోర్ధానపల్లె సర్పంచ్ మీనా, బుడితరెడ్డి పల్లె సర్పంచ్ వాసు రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

బంగారుపాళెం: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కీరమంద సర్పంచ్ రాజా అన్నారు. మండలంలోని కీరమంద గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి జబ్బులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు ఉంటి అద్దాలను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 350 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవీంద్ర, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గొడుగుచింతలో...

పూతలపట్టు: మండలంలోని గొడుగుచింత హైస్కూల్‌లో సర్పంచ్ మోహనమ్మ అధ్యక్షతన ×జగనన్న ఆరోగ్య సురక్ష≈ కార్యక్రమం నిర్వహించారు. గొడుగుచింత, వేనూతనపల్లి పంచాయతీల పరిధిలోని ప్రజలు తరలివచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 245 మంది రోగులకు వైద్యాధికారులు వివిధ రకాల పరీక్షలు చేసి, వారికి ఉచిత మందులు అందజేశారు. ఎంపీడీఓ గౌరి కార్యక్రమంలో పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కంటి అద్దాలు, ఆయుష్మాన్ యోజన కార్డులను ఆరోగ్య సురక్ష సంచిలో పొందుపరిచి రోగులకు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, వేనూతనపల్లి సర్పంచ్ ప్రవీణ్, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సుబ్రమణ్యం, వైద్యాధికారులు ప్రవీణా, ప్రియాంక, అరవింద్, శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్ భారతి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు టి.పుత్తూరులో..

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ధాత్రేయ చౌదరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వైద్యశిబిరం నిర్వహించి అన్ని రకాల జబ్బులకు అవసమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బంగారుపాళెం: వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు


ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చందన


యాదమరి: కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు


త్రోబాల్ ఆడుతున్న విద్యార్థులు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 450 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా ఎంఈఓలు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం ఆధ్వర్యంలో బాలుర, బాలికల విభాగాల్లో పలు ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతిభ ఆధారంగా న్యాయ నిర్ణేతలు బాలికల విభాగంలో 14 మందిని, బాలుర విభాగంలో 14 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.సురేష్, విజయకుమారి, బాబు తెలిపారు. వీరికి ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 5 రోజుల పాటు రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్ ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయం మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని ఇందరు విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ చూపడం శుభపరిణాం అంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కార్యదర్శులు సుబ్రమణ్యం రెడ్డి, నూరుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు